169

# వివాద మహోత్సవం

"జానక్యాః కమలామలాంజలిపుటే యాః పద్మరాగాయితాః, న్యస్తా రాఘవ మస్తకేచ...."

గోపాలరావు కుర్చీలో జేరగిలబడి రాగయుక్తంగా శుభలేఖ చదువుకోసాగాడు. ఆ ఆఫీసులో అతను పెళ్ళికాని ఎల్.డి.సి.

"మంగళం మహత్" అన్నాడు అతని కంటే ఆయిదేళ్ళ సీనియర్ ఎల్.డి.సి. వెంకటేశ్వర్లు.

అప్పుడే టైప్‌రైటర్ మూత తీసి ఇంకా పేపర్ లోడ్‌చెయ్యని శర్మ కీబోర్డ్ మీద లయ వెయ్యసాగాడు.

"ఏమిటోయ్ ఆ సందడి!"

ఫైళ్ళ స్విమ్మింగ్‌పూల్‌లో అప్పుడే దూకబోతున్న హెడ్‌క్లార్క్ నరసింహం ఆ ముగ్గురి వాలకం చూసి అన్నాడు.

"పెళ్ళి సందడి సార్. వివాహ మహోత్సవం" వెంకటేశ్వర్లు జవాబిచ్చాడు.

"అంటే?" అనుమానంగా గోపాలరావు వైపు చూశాడు నరసింహం.

"సీతాకళ్యాణం సార్" అన్నాడు గోపాలరావు, కుర్చీలో కొంచెం సర్దుకుంటూ.

"ఎవరా సీత?"

"మా మేనత్త కూతురు" గోపాలరావు జవాబిచ్చాడు.

"శ్రీరస్తు, శుభమస్తు. ఎవరా రామచంద్రుడు, నువ్వేనా?"

"నేనే అయితే అచ్చు పడకముందే అనేక శుభలేఖార్థాలు మీకు తెలియ చెయ్యకుండా ఉంటానా? నేను కట్నం పుచ్చుకో నన్నానండి. అయితే నువ్వు ఏనాటికైనా సినిమా హీరోవి అవుతావు, సినిమాల్లో వేషాలు వేసేవాడికి నా పిల్లనివ్వను అని మా మామయ్య మరో సంబంధం నిశ్చయించుకున్నాడు సార్."

నరసింహం నవ్వాడు.

"ఏం, ఎందుకొద్దన్నావు ? కట్నం మరీ తక్కువిస్తానన్నాడా మీ మామయ్య."

"ఆ అమ్మాయి నీకు నచ్చలేదని చెప్పరాదూ ?" అన్నాడు శర్మ.

"కాదు, ఆ పిల్ల మరీ అప్సరస అయి ఉంటుంది" అన్నాడు వెంకటేశ్వర్లు.

"నీ కంటే ఎక్కువ చదువుకుందా ఏమిటి ?" అన్నాడు నరసింహం.

"అసలు మనవాడు పెళ్ళి చేసుకోట్టండీ" అన్నాడు, అప్పుడే డిస్పాచ్ సెక్షన్ నుంచి వస్తున్న డిస్పాచ్ క్లార్క్ కోటేశ్వరరావు.

"అదేమిటోయ్ ? నిజమేనా ?"

"ఎందుకు సార్ పెళ్ళి ? తొందరపడి పెళ్లిచేసుకోవటం, తరవాత జీతం డబ్బులు చాలటంలేదని విచారించటం, విచారించటం మానేసి కక్కుర్తి పనులు చెయ్యటం—"

హెడ్‌క్లార్క్ గతుక్కుమన్నాడు. అయితే వెంటనే చిరునవ్వు నవ్వి ఓ జోక్ విసిరేశాడు.

"విచారించటం ఎలాగూ తప్పదోయ్. సోక్రటీస్ ఏమన్నాడు—పెళ్లిచేసుకున్నా, చేసుకోకపోయినా విచారించటం తప్పదుట—అందుకని పెళ్లిచేసుకునే విచారించు."

అందరూ నవ్వారు.

"కొందరి విచారం మరికొందరికి వినోదం సార్" అన్నాడు గోపాలరావు.

"ప్చ—ప్రపంచం."

"మా సీత పెళ్ళికి పోకపోతే నాకు బోలెడు విచారం కలుగుతుంది. ఆఫీసరు గార్నడిగితే కిందా మీదా పెట్టి చిట్టచివరికి ఒక్కరోజు సెలవు మాత్రం ఇస్తానన్నాడు. ఎలా సార్ ? విశాఖపట్నంలో పెళ్లి. ఒక్కరోజులో ఎలా వెళ్ళివస్తాను ? అందులో ఎటూ కాని వేళ ముహూర్తం—అర్ధరాత్రి. కనీసం మూడు రోజులైనా కావాలి కదా!"

నరసింహం సానుభూతిగా చూసి "ఆఁ—కావాలి, మరి" అన్నాడు.

"ఆయన ససేమిరా ఒక్కరోజు కంటే సెలవు ఇవ్వనన్నాడు సార్."

"బాసిజం" అన్నాడు శర్మ కోపంగా.

"దౌర్జన్యం" అన్నాడు వెంకటేశ్వర్లు.

"సింహాసనం అలాంటిదిలెండి" అన్నాడు కోటేశ్వరరావు వేదాంతిలా.

"మార్చి ఆఖరు అనుకో" నసిగాడు నరసింహం.

"అయితే మాత్రం అర్జంటు పనులు ఆగుతాయా సార్ ?"

"అబ్బే - ఆగుతయ్యని కాదు. ఆయన అసలే కోతి — మార్చి ఆఖరు అంటే మరీ నిప్పులు తొక్కుతాడు."

"గోపాలరావు తరపున మీరు కాస్త నచ్చచెప్పాలి సార్." శర్మ సిఫారసు చేశాడు.

"వొట్టి కర్కోటకుడోయ్. మాట వినేరకం కాదు. అందరికీ తెలిసిందేగా."

"అలా అంటే ఎలా సార్ ?" వెంకటేశ్వర్లు అన్నాడు.

"లాభం లేదోయ్." పెదవి విరిచాడు హెడ్‌క్లర్క్ నరసింహం.

"ఎందుకు లేదు సార్-సెలవు అనేది ఆయన తాత సొమ్మా ?" గోపాలరావు కోపంగా అన్నాడు.

"హుష్-నెమ్మదిగా మాట్లాడు. ఆయన వింటాడు."

"ఏం వింటే ? తలగిల్లి మొలేస్తాడా ?"

"ఏమిటోయ్ ఆ దూకుడు ? కొంచెం తగ్గు మరి" హెడ్‌క్లర్క్ మంద లించాడు.

"దూకుడేమిటి సార్ ? సెలవ ఎందుకియ్యరో చూస్తా-"

గోపాలరావు చప్పున లేచి నిలబడ్డాడు. అందరూ సంభ్రమంతో అతని వైపు చూశారు.

"శాంతం - శాంతం స్వామీ" శర్మ అన్నాడు.

"తొందరపడకోయ్." హెడ్‌క్లర్క్ పొడిపొడిగా నవ్వాడు.

"ఎంత ఉడుకు రక్తమయితే మాత్రం కొండతో ఢీకొంటావా ఏమిటి — చాలు చాల్లె కూర్చో."

"ఈ అన్యాయం నేను సహించను, లీవ్ ఈజ్ మై బర్త్ రైట్ - సాధించి తీరతాను. చూడండి" గోపాలరావు చేతిలోని శుభలేఖ ఝుళిపించాడు.

అందరి ముఖాల్లో ఆశ్చర్యం తాండవించింది. ఏం చేస్తాడితను ?

"ఏమిటోయ్ పెద్ద మొనగాడివేలే కూర్చో" అన్నాడు సీనియర్ ఎల్.డి.సి. వెంకటేశ్వర్లు, గోపాలరావు భుజంమీద చెయ్యివేసి కూలదోయటానికి ప్రయత్నిస్తూ.

"నో" అన్నాడు గోపాలరావు లేచి నిలబడి.

"ఆవేశపడకోయ్" అన్నాడు నరసింహం కుతూహలం అణచుకుంటూ.

"సెలవు నా జన్మహక్కు—ఎవరూ నన్నాపకండి. ఐ వాంట్ లీవ్ ! ఐ షల్ గెట్ ఇట్."

గోపాలరావు ఆఫీసర్ గదివైపు రెండడుగులు వేశాడు. అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. అందరి ముఖాల్లో ఏదో సంభ్రమం, ఏదో ఆసక్తి, ఏదో కోరిక, ఏదో కుతూహలం తాండవించసాగాయి. శర్మ అతని చెయ్యిపట్టి నీరసంగా లాగాడు. డిస్పాచ్ క్లర్కు కోటేశ్వరరావు "గోపాలరావు, నీకేమైనా పిచ్చా" అని అతని దారికి అడ్డు రావటానికి సగం ప్రయత్నం చేశాడు. నరసింహం కూడా లేచి "ఇదిగో గోపాలరావ్, ఊరుకో—దుష్టం దూరేణ వర్జయేత్ — ఊఁ" అన్నాడు. వరండాలో ఇంతసేపూ బీడీ కాల్చుకుంటూ నిలబడి ఈ సంభాషణ ఆలకిస్తున్న జమాను రామయ్య చప్పున బీడీ పారేసి "తొందర పడకండి సార్" అంటూ గోపాలరావు చేతిలోని శుభలేఖ లాక్కోటానికి ప్రయత్నించాడు.

గోపాలరావు అందర్నీ తోసుకుని ఆఫీసరు గదిలోకి విసురుగా జొరబడ్డాడు.

'అంతా అయిపోయింది' అన్నట్టు అందరూ ఒకరివైపు ఒకరు చూశారు. ఏదో చప్పుడైంది.

నిశ్శబ్దం. ఒక్కక్షణం మహానిశ్శబ్దం.

ఏం జరుగుతుందో! అందరూ గుండెలు చేత్తో పట్టుకుని చెవులు రిక్కించి నిలబడ్డారు. కుర్రాడు బిలైపోతున్నాడు. ఆఫీసర్‌కి మూడింది. హుఁ—ఇంక సీమ టపాకాయల పేలుళ్లు....బాంబులు....హుష్....హుష్....అరెరె!

ఏమిటి?....ఏమిటి?....సరిగ్గా వినబడటంలేదే!

"నో!" పిడుగు పడ్డది. అందరికీ ఒళ్ళు జలదరించింది. భావావేశం పెల్లుబికింది. భయాందోళనా సంభ్రమాశ్చర్యాలు ముప్పిరిగొన్నాయి. వాతావరణంలో ఉద్రిక్తత ఆవహించింది.

"సెలవు ఉద్యోగి జన్మహక్కు" ఘంటాపథంలా వినబడ్డది గోపాలరావు స్వరం.

"సెలవు నిరాకరించటం అధికారి జన్మహక్కు" అంతకంటె దృఢంగా అధికారి గొంతు.

"ఆ ధోరణి తరతరాల బూజుకి చిహ్నం."

"కాదు. బాధ్యతాయుత విధినిర్వహణ లక్షణం."

"ఆ విధి నిర్వహణ బురఖాలో ఉన్నది అధికారదర్పం. నియంతృత్వ, దౌర్జన్యం."

"ఆఫీసులో జీతం ఇచ్చేది సోమరిలా షికార్లు కొట్టడానికి కాదు."

"జీవితం జీవించటానికి, ఆఫీసుకి అంకితం కావటానికి కాదు."

"అయితే బయటికి వెళ్ళి నీ ఇష్టం వచ్చినట్టు జీవించవచ్చు."

"సెలవు ఇస్తారా, ఇవ్వరా?"

"నో."

"ఇచ్చి తీరాలి."

"ఇంపాసిబుల్."

"ఎలా ఇవ్వరో చూస్తా."

బల్లమీద కొట్టిన చప్పుడైై అందరూ ఉలిక్కిపడ్డారు. హెడ్‌క్లార్క్ నరసింహం పెదవి విరిచి "ప్చ్—చాలా దూరం పోతున్నాడు" అన్నాడు. అందరూ తలలూపి మళ్ళీ చెవులు రిక్కించారు.

"గెటవుట్."

"సంతకం పెట్టు—ఊఁ."

"ఏమిటీ దౌర్జన్యం? నిన్ను డిస్మిస్ చేసిపారేస్తా."

"సంతకం పెడతావా, లేదా?"

"పోలీస్."

"షటప్."

అందరూ అదిరిపడ్డారు.

"ఏం—మీదిమీది కొస్తున్నావు. చెయ్యి చేసుకుంటే నీ అంతు చూస్తా—"

బల్ల ఠంగున మోగింది.

శర్మ స్వింగ్‌డోర్ తెరవబోయాడు, నరసింహం ఆగమన్నట్టు సంజ్ఞచేశాడు.

కుర్చీలు, బల్లలు కిందపడ్డ చప్పుడైంది. ఆ తర్వాత గట్టిగా చెంపదెబ్బ కొట్టిన చప్పుడైంది.

నరసింహం చప్పున డోర్ తెరిచాడు, వెంటనే ఒక్కుమ్మడిగా గదిలోకి ప్రవేశించారు.

"ఆగు ఆగు గోపాలరావు."నరసింహం చప్పున గోపాలరావువైపు పరిగెత్తాడు.

అధికారి చప్పట్లు కొట్టాడు.

"వండర్ ఫుల్."

అందరూ నిర్ఘాంతపోయి చూశారు. గోపాలరావు చిరునవ్వుతో ఆఫీసర్ వైపు చూస్తూ నిలబడ్డాడు. కుర్చీలు, బల్లలు అన్నీ యథాస్థానంలోనే ఉన్నాయి.

ఎవరికీ ఏమీ అర్థం కాలేదు.

"చూశారా నరసింహంగారూ! మన గోపాలరావు నాట్యావధానం! ఇతను నాట్యావధానం చేస్తాడని నిన్ననే తెలిసింది. సెలవు కారణంగా ఆఫీసర్‌కూ ఉద్యోగికీ ఘర్షణ ఊహించి ప్రదర్శించమని సరదాగా అడిగాను. గొప్పగా ఉందోయ్ గోపాల రావ్—ఎక్సలెంట్. మూడురోజుల సెలవు మంజూర్, కంగ్రాట్స్—"

నరసింహం, శర్మ, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, రామయ్య నోటమాట రాక నిశ్చేష్టంగా నిలబడిపోయారు. అందరికీ ఏదో అసంతృప్తిగా ఉంది. ఎవరో ఏదో మభ్యపెట్టి తమ దగ్గిర ఏదో కాజేసి పోయినట్టు అనుభూతి పొంది గోపాలరావు వైపు కొరకొర చూశారు.

"థాంక్స్ సర్" అని గోపాలరావు గదిబయటికి వచ్చాడు.

అతనివెంటే వచ్చి నరసింహం అన్నాడు— "విడసేద్దామన్నా కాళ్ళూ చేతులూ ఆడలేదు. పోన్లే, నయమే. 'దుష్టం దూరేణ వర్జయేత్'—గుర్తుంచుకోవోయ్."

గోపాలరావు ముసిముసిగా నవ్వాడు—

[యువ, మార్చి 83]